

# మా విజయవాడ విజయయాత్ర



నా బ్లాగ్ పాఠకులకి నూతన సంవత్సర శుభాకాంక్షలు.




మీ అందరి సహకార ప్రోత్సాహములతో నాబ్లాగ్ గత సంవత్సరపు యాత్ర విజయవంతముగా ముగించుకుని వడివడిగా అడుగులువేస్తూ కొత్త సంవత్సరములోకి వుత్సాహముగా ప్రవేశించింది. ఈ బ్లాగ్ విజయం మీదే.

## ఈ విజయోత్సవ సందర్భముగా ఒక చిన్న కానుక.



మేము డిశంబర్ 24 నుండి 31 వరకు ఆంధ్రప్రదేశ్ వెళ్లాము. ఈప్రయాణం మాకు చిరస్మరణీయంగా మనసులో ముద్రించుకు పోయింది. మామొదటి మజిలీ విజయవాడ పట్టణం. ఈపట్టణం గురించి ప్రత్యేకంగా చెప్పాలంటే కనకదుర్గమ్మ.

ఇంద్రకీలాద్రి పై కొలువైవున్న అమ్మదుర్గమ్మ, అయ్య మల్లేశ్వరస్వామి వారితో సదా విజయవాడ ప్రజల్నితన కనుసన్నలలో కాపాడుతూ వుంటుందని యిక్కడి ప్రజల ప్రగాఢ విశ్వాసం.



నిత్యమూ అమ్మకి పూజలూ వుత్సవాలూ చేస్తూ యెంతో భక్తిశ్రద్ధలతో సేవించుకుంటూ తరిస్తూ నిశ్చింతగా నమ్మకంగా కాలం గడుపుతున్నారు. వారి నమ్మకం యేనాటికీ వమ్ము కాదు.

మా తమ్ముడు, మరదలూ విజయవాడ పట్టణంలో స్వంత ఫ్లాట్‌లో వుంటున్నారు. మమ్మల్ని వచ్చి యిల్లు చూసి వాళ్లని ఆశీర్వదించమని యెంతో ఆప్యాయంగా ఆహ్వానించారు. వారి ఆహ్వానం మేరకు మేము విజయవాడ వెళ్లాము. కనకదుర్గని చూసి పులకించిపోయాము. పచ్చని ముఖవర్చస్సుతో, చల్లని చిరునవ్వుతో, ధగధగ మెరిసే ముక్కెరతో కళకళలాడుతూ అభయమిస్తున్న అమ్మ; తెల్లగా ప్రశాంతంగా దీవెనలిస్తున్న అయ్య మల్లేశ్వరస్వామి ... ఆహా! ఆదిదంపతులు కొలువైవున్న యీ కృష్ణా



తీరం యెంత పవిత్రమైనది కదా! ఈతీరప్రజలు యెంత అదృష్టవంతులో!! కళ్లవేడుకగా, మనసు నిండుగా వారి పవిత్రరూపాలని ముద్రించుకుని ప్రసాద సేవనం చేశాము. అమరావతి ... బౌద్ధవిగ్రహం, మ్యూజియం ... మరి అమరేశ్వర స్వామి – బాల చాముండేశ్వరి కొలువై అమరావతి తీరాన్ని పరిరక్షిస్తున్నారు. ఆ పవిత్ర దేవాలయంలో అర్చన, అభిషేకము చేయించాము. ఇవన్నీ మా తమ్ముడు, మరదలు పూనుకుని యెంతో భక్తిశ్రద్ధలతో పర్యవేక్షించి పరిపూర్తిగా చేయించారు. మాకు చాలా తృప్తి కలిగింది. చిన్నవాళ్లైనా యెంతో నియమ నిష్ఠలతో అన్నీ చేయించారు.



అమరావతి బౌద్ధానికి ప్రసిద్ధి చెందిన ప్రాంతం. కానీ యిప్పుడు ప్రజాదరణ, ప్రభుత్వ చేయూత లేక మ్యూజియం వెలవెల బోతోంది. ఎన్నో అద్భుతమైన కళాఖండాలు వున్నాయి, పురాతన వస్తుశాఖ వారు సేకరించి పెట్టిన అత్యంత విలువైన శిల్పఖండాలు వున్నాయి. కానీ గుర్తింపులేదు..



వెలుగు కరువై మసకచీకట్లో మసి బారిపోయివున్న ఆ అమూల్య వస్తు సముదాయం చూసిన మాకు చాలా బాధ కలిగింది. చరిత్రలో కలిసిపోతున్న ఆశిధిలాలు రాబోవుతరాలకి యిచ్చే సందేశం ఒకకన్నీటిబొట్టు మాత్రమేనా? మనదేశంలో పుట్టిన యీ అహింసా వాది మనకే కాని వాడైపోయాడు. అక్కడ వున్న పెద్దబుథ్ధవిగ్రహానికి ఒక ఫొటో తీసుకున్నాము. ఆపవిత్రమూర్తికి అంజలి ఘటించి నమస్కరించాము.



హాయ్!
యిక కొండపల్లి బొమ్మల గురించి
యెంత చెప్పినా తక్కువే!!



ఆ గ్రామంలో వున్న కళాకారుల చేతుల్లో అద్భుతమైన రూపు దిద్దుకుని, ఆకర్షణీయమైన రంగులద్దుకుని వయ్యారంగా మనల్ని పలకరించే ఆ బొమ్మల అందాలు ఏమని వర్ణించగలను? ఆ అపరబ్రహ్మల అపూర్వ సృష్టికి జోహార్లు. మన సంస్కృతి ప్రతిబింబించే ఆబొమ్మలు పక్షులూ, పశువులూ, పల్లకీలూ, పడవలూ



ఒకటేమిటి ... యెన్నో యెన్నెన్నో మన ఆచార వ్యవహారాలని నిశబ్దంగా కర్రమీద చెక్కి మన మనసుకి ఆహ్లాదపరుస్తున్న ఆ గ్రామ ప్రజలకి మనసా శిరసా అభివందనాలు. ఇకపోతే దశావతారాలుగా వెలసిన భగవానుడు మనయింట్లో కొలుపై వుండవలసిందే.

వయ్యారంగా నడుము, శిరసూ కదిలిస్తూ మనల్ని కవ్వించే ఆ పడుచు వలలో పడనివాళ్లు యెవరైనా వున్నారా?? ఇది మిషనుతో చేసేపని కాదు. ఒకనమూనాతో తయారవడానికి. ప్రతీ బొమ్మా, ప్రతీ చెక్కుడూ ప్రాణం పోసుకోవాలంటే ఆకళాకారులు తమ సమయం ప్రాణం, ధారపోయవలసిందే. జీవకళ వుట్టిపడే ఆబొమ్మలు కొన్నిమాత్రమే కొనగలిగాము.

కొండపల్లి బొమ్మలతో మనం యింట్లో పెట్టుకునే బొమ్మలకొలువు సార్ధకత చెందుతుంది. తమ మేధా సంపత్తి ధారపోసి యింతటి అందాలు సృష్టిస్తున్న ఆకళాకారులకి యివే మా నమస్సుమాంజలి.



"కొండపల్లి బొమ్మల నడుమ రచయిత్రి కృష్ణవేణి"

ప్రియమైన పాఠకులారా!

నేను చెప్పినవి అన్నీ మీకుతెలిసినవే కదా!

కొత్తగా చెప్పేది యేముంది?

నామనోభావాలు వెల్లడించిన తృప్తి నాకు చాలు.

మరొక్కసారి నూతనసంవత్సర శుభాకాంక్షలు.

జైహింద్ - మీకృష్ణవేణి.